కథా నిలయం
1481
శ్రీకాకుళం

# బొమ్మ - బొరుసు

పద్మా! "నీ లాంటి భార్య దొరకడం నా అదృష్టం" కృష్ణ ఆ రాత్రి ఆమె చెవిలో గుసగుసలాడాడు.

ఆమె అతనికి అనుకూలవతి. అన్ని విధాలా అనుకూలవతి. అతని మాట ఏనాడూ జవదాటలేదు. అక్షరాలా అతను చెప్పినట్లు నడుచుకునే ఉత్తమ ఇల్లాలు. ప్రతి క్షణం భర్తకేది ఎట్లా కావాలో అట్లా చూసి, "శయనేషు రంభ" అన్నట్లు పడకగదిలో కూడా ఏ శృంగార నాయికకూ దీటుపోని రీతిలో కృష్ణకు స్వర్గ సుఖాలందించే అర్ధాంగి ఆమె. అందుకే ఒక్క రాత్రి పూటే కాదు, ఇంకా ఎన్నోసార్లు మనస్ఫూర్తిగా అంటాడు 'ఆమెలాంటి భార్య దొరకడం తన అదృష్ట'మని.

పద్మకూ కృష్ణ అంటే అమితమైన ప్రేమ. ఇద్దరూ ఏ అరమరికలూ లేకుండా భార్యా భర్తలుగా ఒకరి ప్రేమను ఒకరు పంచుకున్నారు. కాలం కౌగిట కరిగిపోయిన సమయం, ఆ ఇద్దరి అనురాగఫలం ముత్యాల్లాంటి ఇద్దరు మగపిల్లలకు తల్లినీ, తండ్రినీ చేసింది.

కృష్ణకు అసంతృప్తి తెలియదు. అంతగా మరపించి, మురిపించి లాలించింది పద్మ. ఏనాడూ జ్వరం వచ్చి పడుకోవడం కూడా ఎరుగదామె- -అంత మంచి ఆరోగ్యం.

1481

పద్మకు ప్రియనెచ్చెలి, స్నేహితురాలు, మనసు విప్పి మాట్లాడుకునే నేస్తం రాణి. ఇద్దరి స్నేహంలాగా, ఆ ఇద్దరి జీవితాల్లో ఒకలైన విషయం అన్యోన్యదాంపత్యం.

రాణి భర్త శ్రీరామ్ కూడా చాలా మంచివాడు. అతడు రాణిని ప్రేమిస్తాడు. కానీ అంతకంటే రెట్టింపు ప్రేమతో రాణి తన భర్తనంరించి తనబతుకులో ఆనందం పండించుకుంటోంది. ఈ జంటకు సంతానం ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. రాణి, పద్మ చాలా తరచుగా కలుసుకుంటుంటారు.

ఆ రోజు పద్మ ఎందుకో బద్ధకంగా ఉండి లేవలేదు ఒంట్లో ఏదో అనారోగ్యం ప్రవేశించినట్లు అనుమానంగానే ఉంది. వక్షోజాల్లో చిన్నగా ఏర్పడ్డ గడ్డ మొదట్లో అంతగా పట్టించుకోలేదు. కానీ డాక్టరు దగ్గరకు వెళ్ళక తప్పలేదు.

పద్మ అనారోగ్యం చూసి కృష్ణ చాలా హడావుడి చేశాడు. కంగారు పడ్డాడు. దగ్గరుండి డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళి పరీక్ష చేయించాడు. డాక్టరు బయాప్సీ చేసి కాన్సర్‌గా తేల్చడంతో పద్మ ఎంత కుంగిపోయిందో కృష్ణ అంతకంటే ఎక్కువగా బాధపడ్డాడు. కన్నీళ్ళు పెట్టుకుంటున్న ఆమెను ఓదార్చి ధైర్యం చెప్పాడు. అతనుచూపే ప్రేమకు ఆమె బాధ రెట్టింపు అవుతుండేది. డాక్టర్ ఆపరేషన్ చేసి కాన్సర్ సోకిన భాగాన్ని తొలగించాడు. "నువ్వు ఇంత మంచి దానివి నీకీ జబ్బు రావడం ఏమిటి?" అంటూ చాలా ఆవేదనపడుతున్న కృష్ణను కొన్నిసార్లు తానే ఓదార్చ వలసి వచ్చేది.

ఐతే ఇప్పుడు ఆమెకు ఇదివరకున్నంత ఓపిక ఉండటం లేదు. ఇంట్లోపని ఎట్లాగో చేసుకుంటున్నా శారీరకంగా ఆమెలో శక్తి సన్నగిల్లింది. అతనికి కావలసిన సుఖం అందించలేక పోతోందన్న దానికి నిదర్శనంగా కృష్ణ మొహంలో అస్పష్టంగా అసంతృప్తి. కానీ ఆమె నిస్సహాయురాలిగా ఉండిపోయింది.

పద్మ దురదృష్టమేమోగానీ కాన్సర్ ఆమె శరీరంలో చోటు చేసుకుంటూనే ఆమె సుఖవంతమైత జీవితం ముగిసిపోయింది. చాలా యాంత్రికంగా రోజులు గడుస్తున్నాయి ఎంత కాదనుకున్నా ఏదో బాధ పుండులా సలుపుతోంది. ఒంట్లో విపరీతమైన నీరసం. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నసూక్తి పదేపదే గుర్తుకు వస్తూ మరింత బాధ కలుగుతోంది.

డాక్టరు దగ్గర చెకప్ చేయించుకోడానికి వెళ్తే కడుపులో కూడా తనకున్న బాధకి ఆయన పరీక్షలేవో చేయించాలన్నాడు. మళ్ళీ పద్మను దురదృష్టం వెక్కిరించింది. కాన్సర్ భూతం గర్భకోశంలో కూడా పట్టుకుంది.

మళ్ళీ ట్రీట్‌మెంటు, మందులు, పరీక్షలు— ఓ పదిహేను రోజుల తరువాత గర్భసంచి తీసేయాల్సివచ్చింది. శారీరకంగాకంటే కూడా మానసికంగా దెబ్బతింది పద్మ. అప్పుడూ కృష్ణ ఆస్పత్రికి తిరగడం పద్మకేం కావాలో చూడటం, చాలా ఓపిగ్గా చేశాడు. ఐతే చాలా యాంత్రికంగా, తప్పని బాధ్యతగా చేశాడేతప్ప, ఈమధ్యఒక్కసారికూడా ప్రేమగా పలకరించలేదు. ఆమె కోలుకునే వరకు కొన్నాళ్ళు సెలవుపెట్టికూడా

ఆమె అవసరాలు చూశాడు. ఐతే ఎట్లాఉందని అడుగలేదు. తన పక్కన భుజం మీద చెయ్యివేసి ఒక్కసారి 'పద్మా' అని పిలవగూడదా— అని ప్రాణం తపించిపోయేది. పద్మ అత్తగారుకూడా వచ్చింది. ఆవిడ మొహం చిటపటలాడుతూనే ఉంది.

భర్తలో వచ్చిన నిర్లిప్తత, తనపట్ల ముభావంగా ఉండటం ఇటు వంటి పరిస్థితిలో ఆత్మస్థైర్యాన్నిచ్చింది రాణి. దాంపత్య జీవితానికి దూరంగా ఉండాల్సిరావడంతో కృష్ణలో విసుగుపాలు ఎక్కువైంది.

ఇప్పుడతను టైమ్ ప్రకారం ఇంటికి రావడంలేదు. ఆలస్యంగా వచ్చిన కృష్ణను చూసి, "ఇంతసేపు బయట తిరిగితే మీ ఆరోగ్యం పాడవుతుంది" అంటే,

"ఇంటికొచ్చి చెయ్యాల్సిన రాచకార్యలేముంటై? సుఖమా, సంతోషమా?" విసుగ్గా చొక్కావిప్పి అక్కడ పడేసి, ప్యాంటు మార్చి లుంగీ కట్టుకుంటాడు.

మనసు చివుక్కుమన్న పద్మ "అన్నం పెట్టాను రండి" అని పిలిస్తే "నాకు ఆకలి లేదు బయట టిఫిన్ తిన్నాను" అన్నాడు. తను తినకుండా పద్మ తినదని తెలుసు. ఇప్పుడిప్పుడే తీవ్ర అనారోగ్యం నుంచి కోలుకుంటోంది. అలాంటి భార్యను "నువ్వు తిను పద్మా" అని మాటవరసకైనా అనలేదు. ఆమె బుగ్గలమీదుగా కన్నీరు జారిపోయింది. తరచుగా ఇట్లాగే జరుగుతోంది.

అతను పరుషంగా అనే మాటలకు ఆమె కన్నీరు కార్చినా, ఏడ్చినా కృష్ణ అసలు సహించడు "ఇంటి కొచ్చిన దగ్గర్నుంచీ, నీ ఏడుపుగొట్టు మొహం నువ్వూ...."

"మీరెంత మారిపోయారండీ!...." కన్నీటి మధ్య ఆశ్చర్యంగా అన్న పద్మతో "మారక చావనా? నా బతుకులో ఇంకేం మిగిలిందని?" నిరసనగా అన్నాడు కృష్ణ.

"దీంతో చావన్నా రాలేదు...." బాధతో మనసు రగులుతుంటే కన్నీటికీ, దిండుకీ బాంధవ్యం పెరిగిపోయింది.

అత్తగారి ప్రవర్తనా అంతంత మాత్రంగానే ఉంది. తనని శత్రువులా చూస్తోందేమో అనిపిస్తోంది పద్మకు. వీళ్ళెవరికీ తన పాత్ర అంటే ఇప్పుడు ఇష్టం లేదు.

అత్తగారు కొడుకుతో యాభై వేలు కట్నం వచ్చే సంబంధం వివరాలు చెప్తుంటే పద్మ మనస్సు విరిగి వెయ్యిముక్కలైంది.

ఆరోజు అట్లాగే మంచాన్నాశ్రయించి ఏడుపు నుంచి నిద్రలోకి జారిపోయిన పద్మకి రాణి పిలుపుకు హఠాత్తుగా మెలకువ వచ్చింది. టైమ్ సాయంత్రం 5 గంటలు అయివుంటుంది.

రాణి కంగారుగా ఉంది. పద్మ దిగ్గున లేచి కూర్చుంది. ఒక్క నిమిషం అసలు మెదడు పనిచెయ్యలేదు.

"ఏమిటి రాణీ! ఏమైంది??" అంది పద్మ.

"మా వారు మెట్లమీద స్లిప్ అయి కింద పడిపోయినారు...."

"ఫ్రాక్చర్స్ ఏమన్నా అయినయ్యా?" మధ్యలోనే తన ఆత్రం ప్రకటించింది పద్మ.

"ఫ్రాక్చర్ కాదు పద్మా! నడుము దగ్గర్నుంచి కింది వరకూ అసలు స్పర్శే లేదంటున్నారు ..." ఆ మాట చెప్తున్నప్పుడు రాణి కళ్ళల్లో నీళ్ళు చిమ్మినై. కొన్ని క్షణాలు పద్మకూడా షాక్ తిన్నట్లైంది తనూ బాధ పడ్తే రాణిని ఓదార్చేదెవరు?

కన్నీళ్ళు పెట్టుకుంటున్న రాణిని ఓదార్చి, సేదతీర్చి ఆమెతో ఆస్పత్రివైపు నడిచింది పద్మ.

శ్రీరామ్‌కి రకరకాల పరీక్షలు చేశారు. ఎక్స్‌రేలు తీశారు. వెన్నుపూసకి దెబ్బ తగిలినందు వల్ల చేయగలిగిందేమీ లేదని, కొన్నాళ్ళ ఆస్పత్రిలో ఉన్నాక ఇంటికి పంపించేశారు అతణ్ణి

ఇప్పుడు శ్రీరామ్ పూర్తిగా రాణిమీద ఆధారపడాల్సిందే. నడుము నుంచి స్పర్శలేని అతను స్వంతగా లేవలేడు. అవశిష్టాలన్నీ మంచం మీదే. అసలు అవసరాలు కూడా తెలియకుండా జరిగిపోతుంటే అతనికి కలిగిన ఈ ఘోరమైన విపత్తుకు కుళ్ళి కుళ్ళి ఏడ్చింది రాణి.

ప్రతిదీ అందించి, ప్రతీ క్షణం కనిపెట్టి ఉండి చంటిపిల్లాడికి

చేసినట్లు అన్నీ చెయ్యడం రాణి దినచర్య అయిపోయింది. అతన్ని చూస్తే ఆమెకు చాలా ఆవేదన. ఎందుకు దేవుడు అతనికింత అన్యాయం చేశాడు.

శ్రీరామ్‌కి ఇప్పుడు ఉద్యోగం లేదు ప్రతిదీ ఆమెతో చేయించుకోవడం అతనికి ఏదోగా ఉంది. పైగా అన్నింటికంటే ఘోరం- ఆమెకింక తాను సంసార సుఖం ఇవ్వలేడు.

"నీ పేరులోనే రాణి మిగిలిపోయింది రాణీ! నీ జీవితాన్ని శూన్యం చేశాను. ఇట్లా మంచంలో జీవచ్ఛవంలా ఉండే బదులు చచ్చి పోతే...."

అతణ్ని వారించింది రాణి "అంత మాట అనకండి. మీరు నా కళ్ళముందు కనిపిస్తే చాలు. అంతకంటే నేనేం కోరుకోను...." రాణి శ్రీరామ్‌కి మానసికంగా ధైర్యం కలిగించింది. అతను దిగులుపడకుండా ఉండేందుకు సాధ్యమైనంతగా ఉత్సాహ పరిచే ప్రయత్నం చేసింది.

రాణి అత్తగారు ఓ నెల రోజులుంది తోడుగా. కొడుకు పరిస్థితి, కోడలిబాధ పూర్తిగా అర్థం చేసుకోగల మంచి హృదయం సంస్కార ముంది ఆవిడకు అర్థం చేసుకునే మంచిమనసున్న ఆవిడంటే చాలా అభి మానం రాణికి.

ఆవిడ అంది "అమ్మా! రాణీ! నీ కెంతో భవిష్యత్తు ఉంది. నేను న్నాళ్లూ శ్రీరామ్‌ని తీసుకు వెళ్ళి నేను చేస్తాను. నీ భవిష్యత్తు ప్రణాళిక నువ్వు నిర్ణయించుకో...."

"అత్తయ్యా! ఎంత మాటన్నారు! మీరనే భవిష్యత్తు నాకు ఆయన తోనే ముడిపడి ఉంది. ఆయన నా జీవిత సర్వస్వం. సుఖ దుఃఖాలు రెండింటిలోనూ సమానంగా పాలు పంచుకోవడమే భార్యాభర్తల అనుబంధానికి సరైన అర్థం. ఇన్నాళ్ళూ ఆయన సుఖంలో పాలుపంచుకున్నట్లే ఇక ముందు బాధల్లో పాలు పంచుకుంటాను. ఏదైనా ఉద్యోగం చూసుకుంటాను. శ్రీరామ్ వేరే మనిషి కాదు, నాలో ఒక భాగంగా భావిస్తాను."

ఆవిడ కళ్ళల్లో నీళ్లు జలజలా రాలిపోయినై. "అమ్మా! నీలాంటి కోడలు దొరకడం నిజంగా నా అదృష్టం, వాడి పూర్వ జన్మ సుకృతం. నీలాంటి వాళ్లు ఉండబట్టే ఈ కాలంలో కాస్తన్నా నీతి, న్యాయం బతికి ఉన్నై. మరి నేను ఊరికి వెళ్ళిపోతానమ్మా! నేనుకూడా ఉండి నీకు బరువు పెంచదల్చుకోలేదు...." అంది. ఆ మర్నాడే ఆవిడ వెళ్లిపోయింది తానుండే పల్లెటూరికి.

శ్రీరామ్‌కి సంబంధించిన అన్ని పన్లు చాలా ఓర్పుగా, పసిపిల్లాడికి చేసినట్లు చెయ్యడం రాణి దినచర్యలో భాగమైంది. చాలా ప్రయత్నం మీద ఆమె ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం సంపాదించుకుంది. జీతం 600 రూపాయలిస్తారు. ఉద్యోగంలో చేరాక పని మరింత ఎక్కువైంది. ఇంట్లోపని, శ్రీరామ్ పని, పిల్లలపని, వంటపని ఆఫీసు పని, మళ్ళీ ఇంటికొచ్చాక పని.... యంత్రంలా కాలంతో పరుగులు తీస్తోంది రాణి.

శ్రీరామ్ స్వతహాగా చాలా ఉత్సాహంగా పనిచేసే వ్యక్తి. అతను 'ఎంత కాలం ఇట్లా పనికిరాని వాడిగా ఉండాలి? అసలు బతికి ప్రయోజన

పేమిటనుకుంటూ' 5, 6 నెలలు మధనపడ్డాడు. ఇది అతడు నిరాశా వాదిగా గడిపిన సమయం. కానీ క్షణం తీరికలేకుండా జీవితంతో సమరం చేస్తున్న రాణికి తానూ తోడ్పడాలన్న ఆరాటం అతనిలో మొద లైంది.

ఆ ఆరాటానికి ఉపశమనంగా తన పథకానికి రూపకల్పన చేశాడు. అందులో భాగంగా పిల్లలిద్దరూ స్కూలు నించి వచ్చిన తరువాత హోమ్ వర్క్ చేయించడం- ప్రతి పాఠం క్షుణ్ణంగా చెప్పడం.

దాని ఫలితం రెండు నెలల్లోనే బాగా కనిపించింది. పిల్లలు 10, 12 ర్యాంకుల్లో ఉన్నవాళ్లు ఇప్పుడు తేలిగ్గా సెకండ్‌ర్యాంకు తెచ్చుకో గలుగుతున్నారు. బాగా చదవడానికి తేలిగ్గా అలవాటుపడ్డారు. స్కూల్లో జరిగే వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పాల్గొనడానికి పేర్లిస్తే దానికి తగిన విధంగా శ్రీరామ్ వాళ్ళను సానపట్టాడు. పిల్లలకిప్పుడు వాటిల్లో బహు మతులు వచ్చి వాళ్ళు మరింత చురుగ్గా తయారైనారు. అప్పుడు శ్రీరామ్‌లో కలిగిన ఆనందం, ఉద్వేగం వెలకట్టలేనిది పిల్లల చదువుతో కాలక్షేపం సాయంత్రం- మరి ఒంటరిగా ఉండాల్సిన ఓనమంతా?

త్వరలోనే దానికి అతనికి పరిష్కారం దొరికింది. తనలో చెలరేగే భావాలకీ, అనుభూతులకీ అక్షరరూపం ఇవ్వడం మొదలుపెట్టాడు.

ఎప్పుడైతే తన భావాలు కలం నుంచి జాలువారుతున్నాయో ఆలో చనాపరిధి విస్తృతం కావడం మొదలైంది. తెలియని ఎన్నో విషయాలకు, అంతకుముందు చదవాలనుకున్నా సమయం చాలక వదిలేసిన పుస్తకాలు

చదవడానికీ కావలసినంత కాలం. తనకు స్నేహితుడైన మురళి ద్వారా అనేకపుస్తకాలు తెప్పించుకుని చదవడం ప్రారంభించాడు. చదువుతున్న కొద్దీ ఇంకా చదవాలన్న తృష్ణ. ఇంతకాలం ఎంత సమయం వృధా చేసిందీ ఇప్పుడు స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పుడు సమయం ఎలా గడిచేదీ కూడా తెలియడం లేదు. పుస్తకాలు చదవడం, తనలోని భావాలను కాగితం మీద పెట్టడం. దీంతో సమయం వేరే ఆలోచనకు తావులేకుండా గడిచిపోతోంది.

కాగితం మీద కూర్చిన అక్షరాలు కవితలుగా, వ్యాసాలుగా రూపు దిద్దుకునై. తన చుట్టూ జరుగుతున్న ఎన్నో సంఘటనలు కథలుగా రూపుదద్దుకున్నై.

కొత్తల్లో రాణి భయపడింది. చాతకాని వాడినయ్యానన్న ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సుతో తన జీవితం నరకం చేస్తాడేమోననుకుంది. అలాంటి సంఘటనలు ఒకటి రెండు తను చూసింది. కానీ శ్రీరామ్ అవయవ లోపం లేనప్పటి కంటే రెట్టింపు ఉత్సాహంతో ఉండటంతో రాణి భర్తలో లోపాన్ని పూర్తిగా మర్చిపోయింది. ఆమె దృష్టిలో తనకిప్పుడు ముగ్గురు పిల్లలు. పిల్లలు నిద్రపోయి, భోజనాల కార్యక్రమం పూర్తయిన తరువాత రాణి శ్రీరామ్ ప్రక్కన కూర్చుంటే ఇద్దరూ కలిసి తమ కష్ట సుఖాలు, బాధలు కలబోసుకుంటారు. తాను రాసిన కవితలు ఆనందంగా వినిపిస్తాడు శ్రీరామ్.

"ఇన్నాళ్ళూ మీలో ఉన్న కవి, రచయిత ఏమైనాడు?" అని

ఆశ్చర్యపోయిన రాణి అతని రచనలను పత్రికలకు పంపడం కూడా ఒక డ్యూటీగా పెట్టుకుంది.

ఓ 5, 6 నెలల తరువాత శ్రీరామ్ రచనలు వార పత్రికలో రావడం మొదలైంది. అచ్చులో రచనలు చూసుకుంటున్న కొద్ది శ్రీరామ్‌లోను, రాణిలోను మాటలకందని ఆనందం- అదే ప్రోత్సాహంతో అతను రచనా రంగంలో దూసుకు పోతున్నాడు.

* * *

"నేను సాంసారిక జీవితానికి పనికిరాను కనుక నా భర్త మరొక పెళ్ళి చేసుకోవడం నాకు అంగీకారమే." కృష్ణ తనచేతి కందించిన ఆ కాగితాన్ని లెక్కలేనన్ని సార్లు చదివింది. మొదట అర్థంకాలేదామెకు. ఆ తరువాత కళ్ళల్లో నీళ్లు నిండి అక్షరాలు కనిపించడం లేదు.

"దాని మీద సంతకం పెట్టు పద్మా!" హెచ్చరించాడు కృష్ణ.

"నీ లాంటి భార్య దొరకడం అదృష్టం పద్మా- శృంగారంలో లోతులన్నీ నాకు చూపించావు. నీలాగా ఏ భార్యఐనా సహకరిస్తుందనుకోను...." అని ఒకసారికాదు. ఎన్నోసార్లు అన్న కృష్ణ- తానందించే సుఖానికి సంతృప్తిపడ్డ కృష్ణ ఈ రోజు తాను పనికిరానని వేరేదాన్ని పెళ్ళి చేసుకుంటాడా?

మళ్ళీ కృష్ణ అన్నాడు, "నువ్వు ఎక్కడికీ వెళ్ళక్కర్లేదు. నిన్ను అన్యాయం చెయ్యను. నువ్వు ఇక్కడే ఉండొచ్చు".

అతని మాటలకు కడుపులో దేవేసినట్లు బాధ. వేరేదాన్ని పెళ్ళి చేసుకుని ఆవిడతో కాపురం చేస్తుంటే ఆ ఇద్దరికీ సేవచేస్తూ ఓ పనిమనిషి లాగా.... ఛీ! ఇంత నికృష్టమా.

మౌనంగా ఉన్న పద్మ మనసులో చెలరేగే భావాలేమిటో అర్థం చేసుకునే ఆసక్తి లేదు కృష్ణకి. తన చేతిలో కాగితం మీద సంతకం పెట్టి అతనికి అందిస్తూ అంది, "సంసారానికి మీరు పనికిరాని పరిస్థితి వస్తే నేను కూడా ఇట్లాగే వేరే పెళ్ళి చేసుకోవచ్చన్న మాట?"

కృష్ణ మొహంలో నెత్తురు చుక్క లేదు. ఆ మరుక్షణం కోపం చెలరేగింది. "నీకు రోగం వచ్చిందని నా జీవితమంతా నాశనం చేసుకోవాలని నీ ఉద్దేశమా?...."

"వద్దండీ! నాశనం చేసుకోవద్దు. మగవాళ్ళుగనుక మీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించే హక్కు మీకుంది. పెద్దగా చదువులేనిదాన్ని. మీ మీదే ఆధారపడ్డదాన్ని. నేనేం చెయ్యగలను? మీ సుఖం మీరు చూసుకోండి.... నా ఖర్మ నాది...." ఆవేశం క్రమంగా దుఃఖంగా మారింది పద్మకు.

"ఛీ! ఏడుపుగొట్టు మొహం. ఆ ఏడుపుతోనే అన్ని దరిద్రాలూ చుట్టుకుంటై. ఫో, అవతలకి...." కసురుతూ ఆ కాగితం తీసుకుని వెళ్ళిపోయాడు కృష్ణ. నిజంగానే ఏడుపుకు ప్రతినిధిలా గుండె బరువు తీరిందనుకున్న దాకా చీకటి ముసురుకుంటున్న భవిష్యత్తును తలుచుకొని కుములుతూనే ఉంది పద్మ.

* * *

ఆ రోజు రాణి దగ్గరకు వచ్చింది పద్మ. చాలా రోజుల తరువాత వచ్చిన పద్మను ఆప్యాయంగా ఆహ్వానించింది రాణి. శ్రీరామ్‌ని పలకరించాక వచ్చి ఇద్దరూ వంటగదిలో కూర్చున్నారు. రాణి టిఫిన్ తయారు చేస్తోంది.

"ఏమిటి పద్మా! ఏం మాట్లాడటం లేదేంటి? ఒంట్లో బాగా లేదా?...." పద్మ రోజు లాగా లేదు అన్నది మాత్రం స్పష్టంగా తెలుస్తోంది. రాణి మాటలకు ఊఁ ఆఁ అని మాత్రం చెప్తోంది సమాధానం పద్మ. అందుకే ప్రశ్నించింది.

"ఇప్పుడు కొత్త బాగోగులు ఏముంటై?...." అంది నిర్లిప్తంగా పద్మ.

"కాదు, ఇవాళ నువ్వు పరధ్యానంగా కనిపిస్తున్నావ్" అంది రాణి పద్మను పట్టి పట్టి చూస్తూ.

"ఆహాఁ ఏం లేదు రాణీ! పెళ్ళి పిలుపులకు వచ్చాను. అంతే!" అంది బాగ్‌లో నుంచి శుభలేఖ తీసి రాణికి అందిస్తూ.

"పెళ్ళా? ఎవరిది?" అంటూ శుభలేఖ అందుకుని చదివి కంగారుగా, "ఏమిటిది పద్మా! నిజమా?" అంది.

"ఆశ్చర్యమేముంది? నేను నీ ఎదురుగా ఉన్నంత నిజం...."

"దీనికి నువ్వు ఒప్పుకున్నావా?"

"ఆఁ నా అంగీకారాన్ని రాసిచ్చాను కూడా...."

"తొందరపడ్డావేమో పద్మా! ఇప్పుడింక నీ పరిస్థితి ఏమిటి- ఏం చెయ్యదల్చుకున్నావ్? ఎక్కడుంటావ్?"

"అక్కడే, ఆ ఇంట్లోనే"

"పద్మా!...." అంటూ ఆవేదనగా ఏదో అనబోయిన రాణిని మధ్యలోనే ఆపింది పద్మ. "దయచేసి ఏం మాట్లాడకు రాణీ! నేనిప్పుడే మనసు రాయి చేసుకునే ప్రయత్నంలో ఉన్నాను. ఆరోగ్యం కూడా బాగలేని దాన్ని. ఆర్థిక స్వాతంత్ర్యం లేనిదాన్ని. ఏమైనా, కాలం పరిష్కారం చెప్పొచ్చు. నే వెళ్ళొస్తాను...." రాణి పిలుస్తున్నా వినిపించుకోకుండా గబగబా వెళ్ళిపోయింది పద్మ.

తన స్థితినీ, పద్మ స్థితినీ పోల్చుకుని ఆ రెండు సందర్భాల్లోని న్యాయాన్యాయాలను బేరీజు వేసుకుంటూ ఒక కొలిక్కి రాని ఆలోచనల మధ్య కొట్టుమిట్టాడుతుండి పోయిందిరాణి, శ్రీరామ్ పిలిచేవరకూ.

(ఉదయం, ఆదివారం అనుబంధం 16-10-88)